

విభారె

తెలుగు దినపత్రిక

VIBHARE TELUGU DAILY

ఆవుల పుల్లారెడ్డి సేవా సమితి

రి.నెం.119/2015

ఆళ్ళగడ్డ, కర్నూలు జిల్లా

ఉచిత కళ్యాణ మండపం

స్వయం ఉపాధి శిక్షణ

ఉచిత రక్తదానము

ఉచిత న్యాయ సంహాలు

ఉచిత కంప్యూటర్ శిక్షణ

సంప్రదించవలసిన చిరునామా

ఆవుల విజయభాస్కర రెడ్డి

ఆళ్లగడ్డ

9440232308,9494498787

ఎడిటర్ : ఆవుల విజయభాస్కర్ రెడ్డి ప్రచురణ:-నంద్యాల, కర్నూల్. విజయవాడ, హైదరాబాద్, సంపుటి-08 సంచిక-134 పేజీలు- 8 వేల -3

అమరావతి మెగా రైల్వే స్టేషన్ రూట్ ఖరారు..

గంటకు 160 కి.మీ వేగంతో వెళ్లేలా ట్రాక్!

- ఎర్రుపాలెం నుంచి నంబూరు వరకు 58.1 కిలోమీటర్ల మేర కొత్త రైల్వే లైన్
- గంటకు 160 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించేలా ఆధునిక ట్రాక్ నిర్మాణం
- కృష్ణా నదిపై 4.5 కిలోమీటర్ల మేర భారీ ఐకానిక్ వంతెన
- తాడికొండ సమీపంలో అమరావతి ప్రధాన రైల్వే స్టేషన్
- కొప్పరవూరు వద్ద 230 ఎకరాల్లో భారీ రైల్వే టెర్మినల్



ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతికి రైల్వే కనెక్టివిటీ కల్పించే ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టులో కీలక ముందడుగు పడింది. అమరావతి మీదుగా వెళ్లే రైల్వే లైన్ రూట్, రాజధాని ప్రధాన రైల్వే స్టేషన్ ఏర్పాటు చేసే ప్రదేశం, భారీ టెర్మినల్ ప్రాంతాన్ని రైల్వే శాఖ దాదాపు ఖరారు చేసింది. గతంలో రూపొందించిన ప్రణాళికల్లో కొన్ని మార్పులు చేస్తూ తాజా రూపురేఖలను సిద్ధం చేశారు. రాజధాని ప్రాంతానికి పటిష్ఠమైన రోడ్డు, రైలు రవాణా వ్యవస్థను అనుసంధానించడమే లక్ష్యంగా ఈ ప్రాజెక్టును వేగవంతం చేస్తున్నారు.

58.1 కిలోమీటర్ల మార్గం.. గంటకు 160 కిలోమీటర్ల వేగం

ఎర్రుపాలెం (ఖమ్మం జిల్లా), నంబూరు (ఉమ్మడి గుంటూరు జిల్లా) మధ్య నిర్మించనున్న కొత్త రైల్వే కారిడార్ పొడవును గతంలో ప్రతిపాదించిన 56.53 కిలోమీటర్ల నుంచి 58.1 కిలోమీటర్లకు సవరించారు. ఈ మార్గంలో గరిష్ఠంగా గంటకు 160 కిలోమీటర్ల వేగంతో రైళ్లు రాకపోకలు సాగించే విధంగా అత్యంత ఆధునిక సాంకేతికతతో

మిగతా 2లో

రూ.5 లక్షల బీమా, రూ.10 లక్షల వైద్యం

- సంక్షేమ పథకాన్ని రాహుల్ గాంధీ, సీఎం రేవంత్ రెడ్డి కలిసి ప్రారంభం
- ఈ పథకం కింద రూ.5 లక్షల జీవిత బీమా
- రాజీవ్ ఆరోగ్యశ్రీ ద్వారా రూ.10 లక్షల వరకు ఉచిత వైద్యం
- హైదరాబాద్‌లో జరిగిన సభకు ముందు గిగ్ వర్కర్ల భారీ బైక్ ర్యాలీ
- అనంతరం గిగ్ వర్కర్లతో రాహుల్ ముఖాముఖి



తెలంగాణలో గిగ్ వర్కర్లకు సామాజిక భద్రత కల్పించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం కీలక అడుగు వేసింది. వారికి రూ.5 లక్షల జీవిత బీమాతో పాటు రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం కింద రూ.10 లక్షల వరకు ఉచిత వైద్య సదుపాయం అందించనున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. హైదరాబాద్‌లోని జయభేరీ గ్రౌండ్స్‌లో శనివారం నిర్వహించిన సభలో లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీతో కలిసి 'తెలంగాణ గిగ్ వర్కర్ల సామాజిక భద్రత, సంక్షేమ పథకం' విధివిధానాలను ఆయన ప్రారంభించారు.

గిగ్ వర్కర్లకు చట్టబద్ధమైన గుర్తింపు

ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. గిగ్ వర్కర్లు కష్టానికి తగిన ఆదాయం పొందలేకపోతున్నారని

మిగతాది 2లో

ఉదయనిధి స్టాలిన్‌కు మద్రాస్ హైకోర్టులో ఎదురుదెబ్బ

- 2026 ఎన్నికల పిటిషన్‌ను కొట్టివేయాలన్న ఉదయనిధి విజ్ఞప్తి తిరస్కరణ
- పిటిషన్‌పై విచారణ కొనసాగిస్తామన్న మద్రాస్ హైకోర్టు
- కౌంటర్ దాఖలు చేయాలని ఉదయనిధికి ఆదేశం



2

తమిళనాడు శాసనసభలో ప్రతిపక్ష నేత, డీఎంకే కీలక నేత ఉదయనిధి స్టాలిన్‌కు మద్రాస్ హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. 2026 అసెంబ్లీ ఎన్నికల్లో చెపాక్-తిరువల్లికేని నియోజకవర్గం నుంచి ఆయన సాధించిన విజయాన్ని సవాలు చేస్తూ హైకోర్టులో పిటిషన్ దాఖలైంది.

గిగ్ వర్కర్లకు అండగా ఉంటాం..

ప్రతి డెలివరీపై 1 శాతం నగదు జమ: రాహుల్ గాంధీ

- తెలంగాణ గిగ్ వర్కర్స్ పాలసీని ఆవిష్కరించిన రాహుల్ గాంధీ
- ప్రతి డెలివరీపై ఒక శాతం మొత్తాన్ని కార్మికుల ఖాతాల్లో జమ చేస్తామని వెల్లడి
- రూ.5 లక్షల ప్రమాద బీమా, పింఛన్, సామాజిక భద్రత కల్పిస్తామని హామీ
- పని, ఆదాయ వివరాలు మొబైల్ ఫోన్లలో అందుబాటులో ఉంటాయని వెల్లడి
- వైఫైతో ప్రత్యేక విశ్రాంతి భవనాలు ఏర్పాటు చేస్తామని హామీ



గిగ్ వర్కర్ల శ్రమకు తగిన ప్రతిఫలం దక్కేలా, వారి హక్కులు, సంక్షేమానికి భరోసా కల్పించడమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యమని లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తెలిపారు. ప్రతి డెలివరీపై ఒక శాతం మొత్తాన్ని కార్మికుల బ్యాంకు ఖాతాల్లో జమ చేసేలా కొత్త విధానాన్ని తీసుకొచ్చామని వెల్లడించారు. హైదరాబాద్‌లో సీఎం రేవంత్ రెడ్డితో కలిసి తెలంగాణ గిగ్ వర్కర్స్ పాలసీని ఆవిష్కరించిన సందర్భంగా ఆయన మాట్లాడారు.

కంపెనీలకే అనుకూలంగా కేంద్ర విధానాలు

మిగతాది 2లో

12 జిల్లాల పోలీసు ఉన్నతాధికారులతో ఎస్ఈసీ సమీక్ష

- తిరుపతి కలెక్టరేట్‌లో 12 జిల్లాల పోలీసు ఉన్నతాధికారులతో ఎస్ఈసీ పునేఠా సమీక్ష
- గ్రామ పంచాయతీలు, పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల భద్రతపై ప్రధాన చర్చ
- ఇటీవల పల్నాడు, రాయలసీమల్లో జరిగిన ఘర్షణల నేపథ్యంలో ముందస్తు చర్యలు



ఆంధ్రప్రదేశ్‌లో జరగనున్న గ్రామ పంచాయతీ ఎన్నికలు, పెండింగ్‌లో ఉన్న పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై రాష్ట్ర ఎన్నికల కమిషనర్ (ఎస్ఈసీ) అనిల్‌చంద్ర పునేఠా ఈరోజు ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. తిరుపతి కలెక్టరేట్‌లో జరిగిన ఈ సమావేశానికి, సమస్యాత్మకంగా గుర్తించిన 12 జిల్లాలకు చెందిన ఐజీలు, డీఐజీలు, ఎస్పీలు హాజరయ్యారు. ఎన్నికల నేపథ్యంలో శాంతిభద్రతల

మిగతాది 2లో

అయ్యో పాపం

అనే రోజులు పోయాయి.. చుక్కలు చూపిస్తాం: బొత్స సత్యనారాయణ

- కక్షపూరిత రాజకీయాలు చేసే వారికి భవిష్యత్తులో గట్టిగా బుద్ధి చెబుతామని బొత్స హెచ్చరిక
- రాష్ట్రంలో ప్రస్తుత పరిస్థితుల్లో ఈక్వాలిటీ రాజకీయాలు పనిచేయవని వ్యాఖ్య
- పార్టీ శ్రేణుల ఆలోచనా విధానం మారాలని జగన్‌కు వివరించినట్లు వెల్లడి



విజయనగరం జిల్లాలో నిర్వహించిన వైసీపీ సమావేశంలో మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ కీలక

మిగతాది 2లో

రాజకీయాల్లో పోటీ.. అభివృద్ధిలో సహకారం

- అభివృద్ధి పనుల విషయంలో కేంద్రంతో కలిసి పనిచేస్తామన్న డీకే శివకుమార్
- మోదీతో తనకు సత్సంబంధాలు ఉన్నాయంటూ జరుగుతున్న చర్చలపై స్పందన
- రాజకీయాలను, అభివృద్ధిని వేర్వేరుగా చూడాలని వ్యాఖ్య
- పలు కార్యక్రమాల్లో మోదీతో శివకుమార్ సరదాగా మాట్లాడటంతో రాజకీయ వర్గాల్లో చర్చ
- రాష్ట్ర ప్రయోజనాల కోసం కేంద్రం దృష్టికి తీసుకెళ్లాల్సిన అంశాలను ప్రస్తావించానని



2

తెలంగాణలో 600కు పైగా మెట్ల బావుల గుర్తింపు

- మెట్ల బావుల పరిరక్షణకు ప్రత్యేక ఎస్‌వోపీలు
- జాతీయ స్థాయికి విస్తరించేలా కార్యాచరణ ప్రణాళిక
- త్వరలోనే కేంద్ర హోంశాఖ కార్యదర్శితో కమిషనర్ భేటీ
- భూగర్భ జలాల పెంపే ప్రధాన లక్ష్యం



తెలంగాణలో చెరువుల పునరుద్ధరణకు అమలు చేస్తున్న స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్స్ (ఎస్‌వోపీ)లను ఇకపై చారిత్రక మెట్ల బావుల (ఊవజూఎవశ్రీశ్రీం) పరిరక్షణకు కూడా వర్తింపజేయనున్నట్లు హైడ్రా

మిగతాది 2లో

సీనియర్ నటుడు గిరిబాబు కన్నుమూత



2

- టాలీవుడ్ లో విషాదం
- అనారోగ్యంతో తుదిశ్వాస విడిచిన గిరిబాబు
- గిరిబాబు వయసు 80 సంవత్సరాలు
- 600కి పైగా చిత్రాల్లో నటించిన గిరిబాబు

తెలుగు చిత్ర పరిశ్రమలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. ప్రముఖ సీనియర్ నటుడు గిరిబాబు (80) కన్నుమూశారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన, ¯

రూ.5 లక్షల బీమా, రూ.10 లక్షల వైద్యం



ఆదాయం పొందలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో రాహుల్ గాంధీని కలిసిన గిగ్ వర్కర్లు తమకు చట్టపరమైన రక్షణ, గుర్తింపు లేదని సమస్యలు వివరించారని గుర్తుచేశారు. వారికి న్యాయం చేస్తామని అప్పట్లో రాహుల్ హామీ ఇచ్చారని, ఇప్పుడు ఆ మాట నిలబెట్టుకున్నారని పేర్కొన్నారు.

వివిధ రంగాలకు చెందిన పలువురి అభిప్రాయాలు, సలహాలు తీసుకున్న తర్వాతే ఈ చట్టాన్ని రూపొందించినట్లు తెలిపారు. ఇచ్చిన మాటకు కట్టుబడి ఉండటమే కాంగ్రెస్ పార్టీ విధానమని రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు.

బైక్ ర్యాలీలో పాల్గొన్న రాహుల్, రేవంత్

సభకు ముందు శిల్పకళా వేదిక నుంచి జయభేరీ గ్రౌండ్స్ వరకు గిగ్ వర్కర్లు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. రాహుల్ గాంధీ, సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్, పలువురు మంత్రులు ఈ ర్యాలీలో పాల్గొన్నారు.

అనంతరం జయభేరీ గ్రౌండ్స్‌లో రాహుల్ గాంధీ గిగ్ వర్కర్లతో ముఖాముఖి నిర్వహించారు. వారి సమస్యలు, డిమాండ్లను నేరుగా అడిగి తెలుసుకున్నారు.

గిగ్ వర్కర్లకు అండగా ఉంటాం..

ప్రతి డెలివరీపై 1 శాతం నగదు జమ: రాహుల్ గాంధీ

కంపెనీలకే అనుకూలంగా కేంద్ర విధానాలు



గిగ్ వర్కర్లకు సంబంధించిన సమగ్ర సమాచారం ఇప్పటివరకు అందుబాటులో లేదని, తమ శ్రమకు ఎంత ప్రతిఫలం వస్తోందనే విషయంలోనూ స్పష్టత లేదని రాహుల్ గాంధీ అన్నారు. గతంలో వారి సంక్షేమంపై జరిగిన సమావేశంలో ఇచ్చిన హామీని ఇప్పుడు నెరవేరుస్తున్నామని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ విధానాలు కంపెనీలకు మాత్రమే ప్రయోజనం చేకూర్చేలా ఉన్నాయని విమర్శించారు. గిగ్ వర్కర్లను మోదీ ప్రభుత్వం, ఆర్ఎస్ఎస్ వెట్టిచాకిరీ కార్మికులుగా మార్చాలని చూస్తున్నాయని ఆరోపించారు. వారిని బానిసలుగా మార్చి దోపిడీ చేయాలనుకుంటే సహించేది లేదని స్పష్టం చేశారు. కార్మికులను సేవకులుగా కాకుండా అభివృద్ధిలో భాగస్వాములుగా తీర్చిదిద్దుతామని చెప్పారు.

ఫోన్‌లోనే పని, ఆదాయ వివరాలు

గిగ్ వర్కర్లకు రక్షణ కల్పించడమే కొత్త చట్టం ప్రధాన ఉద్దేశమని రాహుల్ తెలిపారు. ప్రతి డెలివరీకి సంబంధించిన వివరాలు, చేసిన శ్రమ, దానికి లభించే ప్రతిఫలం నేరుగా వారి మొబైల్ ఫోన్లలోనే అందుబాటులో ఉంటాయని చెప్పారు. గిగ్ వర్కర్ల సౌకర్యార్థం వైపై వసతితో ప్రత్యేక విశ్రాంతి భవనాలు ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు.

ప్రమాదాలు, తీవ్రమైన అనారోగ్య సమస్యలు ఎదురైనప్పుడు గిగ్ వర్కర్లు ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని రాహుల్ గాంధీ అన్నారు. ఈ పరిస్థితిని అధిగమించేందుకు కొత్త చట్టం ద్వారా రూ.5 లక్షల ప్రమాద బీమా కల్పిస్తున్నట్లు తెలిపారు. పింఛన్, సామాజిక భద్రత, పొదుపు కోసం ప్రత్యేక చర్యలు తీసుకున్నామని చెప్పారు. ప్రతి డెలివరీపై ఒక శాతం మొత్తాన్ని గిగ్ వర్కర్ల బోర్డు ద్వారా నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేసేలా ఏర్పాట్లు చేసినట్లు వివరించారు. కార్మికుల హక్కులు, వారి కుటుంబాల విద్య, వైద్యం, సంక్షేమానికి ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

12 జిల్లాల పోలీసు ఉన్నతాధికారులతో ఎస్ఈసీ సమీక్ష

ఎన్నికల నేపథ్యంలో శాంతిభద్రతల పరిరక్షణ, నామినేషన్ల ప్రక్రియ, పోలింగ్ సజావుగా సాగేందుకు తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలపై పోలీసు అధికారులతో ఆయన సమగ్రంగా చర్చించారు.

సమీక్ష ముగిసిన అనంతరం పునేఠా మీడియాతో మాట్లాడుతూ కీలక వివరాలను వెల్లడించారు. గతంలో జరిగిన ఎన్నికల అనుభవాలను దృష్టిలో పెట్టుకుని భద్రతా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. "ఇటీవల జరిగిన ఎన్నికల్లో పల్నాడు నుంచి రాయలసీమ వరకు కొన్ని గొడవలు జరిగాయి. సమస్యాత్మక 12 జిల్లాల ఎస్పీలతో ప్రత్యేకంగా మాట్లాడాం. పంచాయతీ ఎన్నికల సమయంలో మరింత అప్రమత్తంగా ఉండాలని సూచించాం. నామినేషన్ల సమర్పణకు ఎవరైనా ప్రత్యేక ఎస్కార్ట్ కావాలంటే కల్పిస్తాం. దాడి ముప్పు ఉందని ఎస్పీకి చెబితే.. అభ్యర్థులకు ప్రత్యేక భద్రత కల్పిస్తారు" అని ఎస్ఈసీ అనిల్‌చంద్ర పునేఠా స్పష్టం చేశారు.

గత ఎన్నికల్లో చోటుచేసుకున్న ఘర్షణలు పునరావృతం కాకుండా క్షేత్రస్థాయిలో కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని పోలీసు యంత్రాంగాన్ని ఎస్ఈసీ ఆదేశించారు. నామినేషన్ దాఖలు చేసే సమయంలో అభ్యర్థులకు ఎటువంటి ఆటంకాలు కలగకుండా చూడాలని, సమస్యాత్మక ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా ఉంచి ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు పూర్తయ్యేలా బాధ్యత తీసుకోవాలని స్పష్టం చేశారు.

సీనియర్ నటుడు గిరిబాబు కన్నుమూత

ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ నేడు తుదిశ్వాస విడిచారు. ఆయన మృతితో టాలీవుడ్ పరిశ్రమలో విషాద ఛాయలు అలముకున్నాయి. గిరిబాబు పూర్తి పేరు యర్రా శేషగిరిరావు. ఆయన 1946 జూన్ 8న ఉమ్మడి ప్రకాశం జిల్లా రావినూతలలో జన్మించారు. చిన్నతనం నుంచే నాటకాలు, కళారంగంపై ఉన్న ఆసక్తితో ఆయన సినిమా రంగం వైపు అడుగులు వేశారు. 1973లో విడుదలైన 'జగమే మాయ' చిత్రంతో ఆయన నటుడిగా వెండితెరకు పరిచయమయ్యారు. ప్రారంభంలో కథానాయకుడిగా కొన్ని సినిమాలు చేసినప్పటికీ, ఆ తర్వాత ప్రతినాయకుడిగా (విలన్), హాస్య నటుడిగా, క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా మారి తనదైన ప్రత్యేక శైలితో ప్రేక్షకుల అభిమానాన్ని చూరగొన్నారు. నాలుగు దశాబ్దాలకు పైగా సాగిన తన సినీ ప్రస్థానంలో గిరిబాబు 600కు పైగా చిత్రాల్లో నటించారు. ఎన్టీఆర్, ఏఎన్ఆర్, కృష్ణ, మోహన్ బాబు వంటి అగ్ర కథానాయకులందరితోనూ కలిసి నటించిన అనుభవం ఆయన సొంతం. 1977లో వచ్చిన పౌరాణిక చిత్రం 'కురుక్షేత్రం'లో దుశ్శాసనుడి పాత్రలో ఆయన చూపిన నటన ప్రేక్షకులకు చిరకాలం గుర్తుండిపోయింది. ఆ తర్వాత జ్యోతి, మెరుపు దాడి, పసివాడి ప్రాణం, బాలగోపాలుడు, హలో బ్రదర్, సిసింద్రి, లిటిల్ సోల్జర్స్, నిన్నే పెళ్లాడతా, చంద్రలేఖ, నువ్వే కావాలి వంటి ఎన్నో సూపర్ హిట్ చిత్రాల్లో వైవిధ్యమైన పాత్రలను పోషించారు. మారుతున్న కాలానికి అనుగుణంగా కొత్త తరం హీరోల చిత్రాల్లోనూ నటించి మెప్పించారు. మహేశ్ బాబు 'అతడు' చిత్రంలో హీరోయిన్ తండ్రిగా ఆయన చేసిన నటన విశేష ఆదరణ పొందింది. అలాగే గమ్యం, అ ఆ, గీత గోవిందం, డిస్కో రాజా, మోస్ట్ ఎలిజిబుల్ బ్యాచ్‌లర్, జాతి రత్నాలు వంటి సినిమాల్లో విభిన్న పాత్రలతో చివరి వరకూ ప్రేక్షకులను అలరిస్తూనే ఉన్నారు. గిరిబాబు కేవలం నటుడిగానే కాకుండా దర్శకుడిగా, నిర్మాతగా కూడా పరిశ్రమకు విశేష సేవలందించారు. ఆయన స్వీయ దర్శకత్వంలో 'రణరంగం' (1985), 'ఇంద్రజిత్' (1990), 'నీ సుఖమే నే కోరుతున్నా' (2008) వంటి సినిమాలు తెరకెక్కాయి. అలాగే 'మెరుపు దాడి', 'దేవతలారా దీవించండి' వంటి పలు చిత్రాలకు నిర్మాతగానూ వ్యవహరించారు. గిరిబాబు మరణం పట్ల సినీ ప్రముఖులు, అభిమానులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నారు. గిరిబాబుకు ఇద్దరు సంతానం కాగా, పెద్ద కుమారుడు రఘుబాబు ప్రముఖ కమెడియన్ గా కొనసాగుతున్నారు. చిన్న కుమారుడు బోసుబాబు గతంలో ఓ చిత్రంలో నటించారు. గిరిబాబు అర్ధాంగి శ్రీదేవి 2018లో కన్నుమూశారు.

రాజకీయాల్లో పోటీ.. అభివృద్ధిలో సహకారం

రాజకీయ ప్రత్యర్థులుగా ఉన్నప్పటికీ అభివృద్ధి పనుల విషయంలో కేంద్రంతో కలిసి పనిచేస్తామని కర్ణాటక



ముఖ్యమంత్రి డీకే శివకుమార్ స్పష్టం చేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో తనకు సత్సంబంధాలు ఉన్నాయంటూ జరుగుతున్న చర్చలపై స్పందిస్తూ.. రాజకీయాలను, అభివృద్ధిని వేర్వేరుగా చూడాలని వ్యాఖ్యానించారు. "రాజకీయాల్లో పోటీ పడతాం.. అభివృద్ధిలో సహకరించుకుంటాం" అని పేర్కొన్నారు.

బెంగళూరులో శుక్రవారం పింక్‌లైన్ మెట్రో ప్రారంభోత్సవం సహా పలు కార్యక్రమాల్లో మోదీతో శివకుమార్ సరదాగా మాట్లాడటం, సన్నిహితంగా మెలగడం రాజకీయ వర్గాల్లో చర్చకు దారితీసింది. దీనిపై శనివారం మీడియాతో మాట్లాడిన ఆయన.. ఆ సందర్భాలను ఎవరికి నచ్చినట్లు వారు అర్థం చేసుకోవచ్చని అన్నారు. ప్రజాప్రతినిధిగా రాష్ట్ర ప్రయోజనాల కోసం కేంద్రం దృష్టికి తీసుకెళ్లాల్సిన అంశాలను ప్రస్తావించానని తెలిపారు.

మేకెదాటు ప్రాజెక్టుకు అవసరమైన అనుమతులు ఇప్పించాలని మోదీని కోరినట్లు శివకుమార్ వెల్లడించారు. ఈ ప్రాజెక్టుకు సుప్రీంకోర్టు ఆమోదం తెలిపిందని, రాష్ట్రంలోని అన్ని రాజకీయ పార్టీలు అఖిలపక్ష బృందంతో ఢిల్లీ వెళ్లేందుకు అంగీకరించాయని చెప్పారు. అటవీ, పర్యావరణ అనుమతులు సహా పెండింగ్‌లో ఉన్న అంశాలను పరిష్కరించాలని ప్రధానిని కోరినట్లు తెలిపారు. కస్తూరిరంగన్ నివేదికను తిరస్కరించాలని, మెట్రో ప్రాజెక్టు సమస్యల పరిష్కారానికి సాంకేతిక కమిటీ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేసినట్లు చెప్పారు. మెట్రో ప్రాజెక్టు వ్యయంలో రాష్ట్రానికి సమాన వాటా ఇవ్వాలని, బెంగళూరులో 500 కిలోమీటర్ల మేర మెట్రో మార్గాల లక్ష్యాన్ని చేరుకునేందుకు పెండింగ్ అంశాలను త్వరగా పరిష్కరించాలని కోరినట్లు వివరించారు.

డబుల్ డెక్కర్ ఫ్లైఓవర్ల నిర్మాణంపైనా మోదీతో చర్చించినట్లు చెప్పారు. బెంగళూరు అభివృద్ధి శాఖ మంత్రి కృష్ణ బైరేగౌడతో కలిసి నగర అవసరాలను ప్రధానికి వివరించామన్నారు. ఇతర ప్రాంతాల్లో రహదారులు 18-20 శాతం మేర ఉంటే బెంగళూరులో ఆ వాటా 8 శాతమేనని తెలిపారు. భూసేకరణకు చదరపు అడుగుకు సుమారు రూ.50 వేల పరిహారం చెల్లించాల్సి వస్తోందని, అయినా ఫ్లైఓవర్ల నిర్మాణ వ్యయంలో రాష్ట్రం వాటా భరించేందుకు సిద్ధంగా ఉందని వెల్లడించారు. రాష్ట్ర డిమాండ్లపై అఖిలపక్ష బృందంతో ఢిల్లీకి వెళతానని పునరుద్ఘాటించారు.

ఫోన్ ట్యాపింగ్ ఆరోపణలపై పూర్తి నివేదిక తీసుకున్న తర్వాత స్పందిస్తానని చెప్పారు. బెలగావిలోని సువర్ణ విధానసౌధ విద్యుత్ బిల్లుల బకాయిలపై మాట్లాడుతూ.. ఉచిత విద్యుత్ అందుకుంటున్న రైతుల బిల్లులూ పెరిగాయని వివరించారు. వాటి మొత్తం రూ.20 వేల కోట్ల నుంచి రూ.30 వేల కోట్లకు చేరిందన్నారు. కరవు కారణంగా రైతులు నీటి ట్యాంకులు నింపేందుకు ఎక్కువ విద్యుత్ వినియోగిస్తున్నారని, పరిస్థితిని సరిదిద్దేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఉదయనిధి స్టాలిన్‌కు మద్రాస్ హైకోర్టులో ఎదురుదెబ్బ

(మొదటి పేజీ తరువాయి)

ఈ ఎన్నికల పిటిషన్‌ను ప్రాథమిక దశలోనే కొట్టివేయాలన్న ఉదయనిధి అభ్యర్థనను న్యాయస్థానం తోసిపుచ్చింది. ఈ పిటిషన్‌పై పూర్తిస్థాయి విచారణ కొనసాగిస్తామని స్పష్టం చేస్తూ, నాలుగు వారాల్లోగా కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేయాలని ఉదయనిధిని ఆదేశించింది. తదుపరి విచారణను డిసెంబర్ 11వ తేదీకి వాయిదా వేసింది. ఈ నియోజకవర్గంలో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసిన పి. మిలానీ ఈ ఎన్నికల పిటిషన్‌ను దాఖలు చేశారు. ఉదయనిధి తన ఎన్నికల అఫిడవిట్‌లో ఆస్తుల వివరాలను సరిగ్గా వెల్లడించలేదని, నామినేషన్ పత్రాల సమర్పణలో అవకతవకలు జరిగాయని మిలానీ ఆరోపించారు. అయితే, ఫలితాలు వెల్లడైన తర్వాత ప్రజాప్రాతినిధ్య చట్టం ప్రకారం నిర్ణీత 45 రోజుల గడువు దాటిన తర్వాత ఈ పిటిషన్ వేశారని, అందువల్ల దీనిని కొట్టివేయాలని ఉదయనిధి తరఫు న్యాయవాదులు వాదించారు. కానీ ఫలితాలు ప్రకటించిన రోజును మినహాయించి 45 రోజుల సమయాన్ని లెక్కించాలని, ఆ లెక్కన పిటిషన్ గడువు లోపలే దాఖలైందని న్యాయమూర్తి స్పష్టం చేశారు. 2026 ఎన్నికల్లో ఉదయనిధి స్టాలిన్ 62,992 ఓట్లతో విజయం సాధించగా, ఆయన సమీప ప్రత్యర్థి టీవీకే అభ్యర్థి డి. సెల్వం 55,852 ఓట్లు పొందారు. పిటిషనర్ మిలానీకి 30 ఓట్లు వచ్చాయి. తాజాగా హైకోర్టు తీసుకున్న నిర్ణయంతో ఉదయనిధి ఎన్నిక చెల్లుబాటుపై న్యాయ విచారణ ముందుకు సాగనుంది.

తెలంగాణలో 600కు పైగా మెట్ల బావుల గుర్తింపు

(మొదటి పేజీ తరువాయి)

కమిషనర్ ఏవీ రంగనాథ్ వెల్లడించారు. హైదరాబాద్‌లో నిర్వహించిన మెట్ల బావుల పరిరక్షణ, అవగాహన కార్యక్రమంలో ఆయన ఈ కీలక ప్రకటన చేశారు. ఈ బృహత్తర కార్యక్రమాన్ని భవిష్యత్తులో జాతీయ స్థాయి విధానంగా ముందుకు తీసుకెళ్లే అవకాశాలు ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. హైదరాబాద్ నగరంలో నీటి ఎద్దడి, వరద నియంత్రణ, కరవు నివారణ అంశాలపై వచ్చే మంగళవారం కేంద్ర హోంశాఖ కార్యదర్శితో సమావేశం కానున్నట్లు రంగనాథ్ తెలిపారు. ఈ భేటీలో చెరువుల సంరక్షణతో పాటు ప్రాచీన మెట్ల బావుల పునరుద్ధరణను కూడా ప్రధాన ఎజెండాగా చేర్చనున్నట్లు చెప్పారు. చెరువులతో పోలిస్తే మెట్ల బావులు వికేంద్రీకృత జల వనరులుగా సమాజానికి ఎంతో మేలు చేస్తాయని ఆయన వివరించారు. గతంలో ఆలయాలు, చెరువుల పరిసరాల్లో ఉన్న అనేక మెట్ల బావులు కాలక్రమేణా కనుమరుగయ్యాయని, వాటిని తిరిగి వెలుగులోకి తెచ్చి పునరుద్ధరిస్తే భూగర్భ జల మట్టాలు గణనీయంగా పెరుగుతాయని స్పష్టం చేశారు. ప్రస్తుతం ఎల్ నినో ప్రభావంతో నెలకొన్న నీటి కొరత నేపథ్యంలో ఈ చర్యలు ఎంతో ఆవశ్యకమని ఆయన అభిప్రాయపడ్డారు. ఇప్పటికే హైదరాబాద్ పరిధిలో దాదాపు అంతరించిపోయిన పలు చెరువులను హైడ్రా విజయవంతంగా పునరుద్ధరించిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తుచేశారు. అధికారిక లెక్కల ప్రకారం తెలంగాణవ్యాప్తంగా 600కు పైగా, గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో 160కి పైగా మెట్ల బావులు ఉన్నట్లు గుర్తించారు. క్షేత్రస్థాయిలో వీటి సంఖ్య మరింత ఎక్కువగా ఉండే అవకాశముంది. కాగా, ఈ సదస్సు సందర్భంగా ఆకర్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో తెలంగాణ సంప్రదాయ మెట్ల బావుల వారసత్వం, పూర్వకాలపు నీటి సంరక్షణ పద్ధతులపై ఏర్పాటు చేసిన ప్రత్యేక ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర పర్యావరణ, అటవీ, సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్ మాట్లాడుతూ.. ప్రస్తుత నీటి సంక్షోభం కారణంగా పురాతన నీటి పరిరక్షణ పద్ధతులపై ప్రాధాన్యత పెరిగిందన్నారు. సంప్రదాయ జల వనరుల సంరక్షణకు సంబంధించిన కీలక అంశాలను క్యూర్ (జఖ=జు) చట్టంలో చేర్చినట్లు ఆయన వెల్లడించారు. ప్రాచీన జల వనరులకు జీవం పోయడం ద్వారా నగరంలో నీటి భద్రతను పటిష్ఠం చేయవచ్చని అధికారులు భావిస్తున్నారు.ం

అయ్యో పాపం అనే రోజులు పోయాయి..

చుక్కలు చూపిస్తాం

(మొదటి పేజీ తరువాయి)

సమావేశంలో మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ కీలక వ్యాఖ్యలు చేశారు. రాబోయే రోజుల్లో కక్షపూరిత రాజకీయాలు చేసే వారికి తగిన రీతిలో సమాధానం చెబుతామని, చుక్కలు చూపిస్తామని గట్టిగా హెచ్చరించారు. గతంలో మాదిరిగా రాజకీయ ప్రత్యర్థులపై అనవసర సానుభూతి చూపిస్తూ 'అయ్యో పాపం' అని వదిలేసే పరిస్థితులు ఇకపై ఉండబోవని బొత్స సత్యనారాయణ స్పష్టం చేశారు. రాష్ట్రంలో వేగంగా మారుతున్న రాజకీయ పరిణామాలను గమనిస్తుంటే, వైసీపీ నాయకులు, కార్యకర్తలు తమ ఆలోచనా విధానాన్ని (మైండ్ సెట్) మార్చుకోవాల్సిన అవసరం ఎంతైనా ఏర్పడుతోందని ఆయన అభిప్రాయపడ్డారు. అందరినీ సమానంగా చూసే రాజకీయాలు ప్రస్తుత వాతావరణంలో ఇకపై పని చేయవేమోనని ఆయన వ్యాఖ్యానించారు. రాష్ట్ర రాజకీయాల్లో ఎదురవుతున్న ప్రస్తుత పరిస్థితులు, పార్టీ వర్గాలు అనుసరించాల్సిన వైఖరిపై తన మనసులోని అభిప్రాయాలను ఇప్పటికే పార్టీ అధినేత జగన్ దృష్టికి తీసుకెళ్లినట్లు బొత్స వెల్లడించారు. కక్షసాధింపు చర్యలను ఇకపై ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు.

అమరావతికి మెగా రైల్వే లైన్

(మొదటి పేజీ తరువాయి)

ఆధునిక సాంకేతికతతో ట్రాక్‌ను నిర్మించనున్నారు. ఈ మార్గంలో కృష్ణా నదిపై సుమారు 4.5 కిలోమీటర్ల పొడవైన అద్భుతమైన ఐకానిక్ వంతెన ప్రధాన ఆకర్షణగా నిలవనుంది. వీటితో పాటు మొత్తం 32 భారీ వంతెనలు, 92 చిన్న వంతెనలు, రాకపోకలకు ఎలాంటి అంతరాయం లేకుండా 12 రోడ్ ఓవర్ బ్రిడ్జిలు/అండర్ బ్రిడ్జిలు (=వాదీ/=ఖదీ) నిర్మించేలా ప్రణాళిక రూపొందించారు.

తాడికొండ సమీపంలో ప్రధాన స్టేషన్.. కొప్పరావూరులో మెగా టెర్మినల్

రాజధాని కోర్ క్యాపిటల్ ఏరియాలో భాగంగా, తాడికొండకు సుమారు 5 కిలోమీటర్ల దూరంలో ప్రధాన అమరావతి రైల్వే స్టేషన్‌ను నిర్మించనున్నారు. దీనితో పాటు సుదూర ప్రాంతాల రైళ్ల నిర్వహణ కోసం కొప్పరావూరు వద్ద దాదాపు 230 ఎకరాల విస్తీర్ణంలో భారీ టెర్మినల్‌ను ప్రతిపాదించారు. 24 ఎల్‌హెచ్‌బీ (=ఖదీ) కోచ్‌లు కలిగిన భారీ రైళ్లను సులభంగా హ్యాండిల్ చేసేలా దీనిని తీర్చిదిద్దనున్నారు. ఈ టెర్మినల్‌లో 9 ప్రధాన ప్లాట్‌ఫామ్‌లు, 6 సైడ్ లైన్లు, రైళ్ల నిర్వహణకు అవసరమైన పిట్ లైన్లు, మరో 12 స్టేబ్లింగ్ లైన్లు ఏర్పాటు కానున్నాయి. ఈ మెయింటెనెన్స్ హబ్, టెర్మినల్ నిర్మాణం కోసం అవసరమైన భూమిని కేటాయించాలని రైల్వే శాఖ ఇప్పటికే ఏపీ సీఆర్‌డీఏ (ఝా జ=ణా) ను కోరింది.

మార్గంలో ఏర్పాటయ్యే స్టేషన్లు

ఈ కొత్త రైల్వే మార్గంలో మొత్తం తొమ్మిది స్టేషన్లు రానున్నాయి. పెద్దపురం, చెన్నారావుపాలెం, గొట్టుముక్కల, పరిటాల, కొత్తపల్లి, వడ్డమాను, అమరావతి, తాడికొండ, కొప్పరావూరు మీదుగా రైలు మార్గం సాగుతుంది. వీటిలో పెద్దపురం, పరిటాల, అమరావతి, కొప్పరావూరు స్టేషన్లను క్రాసింగ్ స్టేషన్లుగా అభివృద్ధి చేయనున్నారు. భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఎర్రుపాలెం, నంబూరు స్టేషన్లను కీలక రైల్వే జంక్షన్లుగా మార్చనున్నారు. ఈ ప్రాజెక్టు పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తే అమరావతి నుంచి దేశంలోని అన్ని ప్రధాన నగరాలకు వేగవంతమైన, అత్యాధునిక రైల్వే రవాణా సదుపాయం లభించనుంది.



నూతన వధువును ఆశీర్వాదించిన, బనగానపల్లె,మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి,



సంజామల, నవంబర్,14 విభారె న్యూస్:-సంజామల మండలం కానాల గ్రామానికి చెందిన కీర్తిశేషులు మద్దూరు వీర శేఖర్ రెడ్డి గారి కుమార్తె వివాహ ముహూర్త కార్యక్రమానికి హాజరు అయి నూతన వధువును ఆశీర్వదించిన బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, పాల్గొన్న వైఎస్సార్సీపీ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి సిద్ధం రెడ్డి రామ్మోహన్ రెడ్డి, కానాల గ్రామ వైఎస్సార్సీపీ నాయకురాలు పాలూరు పద్మావతి,గోవర్దన్ రెడ్డి, పోచా వెంకటరామిరెడ్డి, పవన్ రెడ్డి, బాలమద్దు, పెద్దయ్య తదితరులు

బిల్లలాపురంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరిన దాదాపు 30 కుటుంబాలు



విభారె న్యూస్:-నవంబరు 14, నంద్యాల జిల్లా. నంద్యాల మండలం బిల్లలాపురం గ్రామానికి చెందిన దాదాపు 30 కుటుంబాలు తెలుగుదేశం పార్టీ నుంచి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరాయి. గ్రామ సర్పంచ్ ఎన్నికల నేపథ్యంలో ఈ చేరికలు చోటుచేసుకున్నాయి. గ్రామ నాయకులు శంకర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, వీూజ దేవేంద్ర గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో నంద్యాల మాజీ ఎమ్మెల్యే శిల్పా రవి చంద్రకిషోర్ రెడ్డి పార్టీ కండువాలు కప్పి నూతనంగా పార్టీలో చేరిన వారిని ఆహ్వానించారు. ఈ సందర్భంగా శిల్పా రవి చంద్రకిషోర్ రెడ్డి మాట్లాడుతూ, పంచాయతీ ఎన్నికల ఫలితాలు తెలుగుదేశం పార్టీకి ప్రతికూల రాజకీయ పరిణామాలకు సంకేతమని వ్యాఖ్యానించారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని అన్నారు. హామీల అమలులో విఫలమైతే ప్రజల నుంచి రాజకీయంగా వ్యతిరేకత ఎదుర్కోవాల్సి వస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, నూతనంగా పార్టీలో చేరిన కుటుంబాల సభ్యులు పాల్గొన్నారు.

నంద్యాల డివిజన్ ఉప విద్యాశాఖ అధికారి కార్యాలయాన్ని సందర్శించిన జిల్లా కలెక్టర్

విభారె న్యూస్:-నంద్యాల, నవంబర్ 14: నంద్యాల జిల్లా కలెక్టర్ శ్రీమతి రాజకుమారి గణియా గారు గురువారం సాయంత్రం 5:30 గంటలకు నంద్యాల డివిజన్ ఉప విద్యాశాఖ అధికారి (ణ్జూ) కార్యాలయాన్ని, సమగ్ర శిక్ష సమావేశ మందిరాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ణ్జూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన గణాంక వివరాలు (ఝ్ఖ్అర్అఝ్ఘశ్రీ ణఝ్ఘ), కార్యాలయ ఫైళ్లు, రికార్డుల భద్రత కోసం ఏర్పాటు చేసిన కప్‌బోర్డులను కలెక్టర్ గారు పరిశీలించారు. అలాగే సమగ్ర శిక్ష సమావేశ మందిరాన్ని సందర్శించి అక్కడి ఏర్పాట్లను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేస్తూ అధికారులను అభినందించారు. అనంతరం మొదటి అంతస్తులో కొనసాగుతున్న భవన మరమ్మతు పనులను స్వయంగా పరిశీలించి, పనుల నాణ్యతతో పాటు అవసరమైన అంశాలపై అధికారులకు పలు సూచనలు చేశారు. విద్యాశాఖ కార్యాలయాన్ని స్వయంగా సందర్శించి, అభివృద్ధి పనులను పరిశీలించి విలువైన సూచనలు అందించిన జిల్లా కలెక్టర్ గారికి జిల్లా పాఠశాల విద్యాశాఖ తరఫున అధికారులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు మండల విద్యాశాఖ అధికారులు (వీజూలు), అదనపు ప్రాజెక్టు కోఆర్డినేటర్ (ఝ్రాజ), కార్యాలయ అధికారులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.



ఘనంగా బాలల దినోత్సవ వేడుకలు





విభారె న్యూస్:-బనగానపల్లె: ఝ్రా మోడల్ స్కూల్ ప్రవలకొండ బనగానపల్లె లో బాలల దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వివిధ క్రీడా పోటీలు నిర్వహించి, వారిలోని క్రీడా ప్రతిభను ప్రోత్సహించారు. ఈ కార్యక్రమానికి పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీమతి జన. రామలక్ష్మి అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా పాఠశాల ఖావీజ చైర్మన్ అక్తర్ అలీ బేగ్, వైస్ చైర్మన్ షాహిన్, పాఠశాల ఉపాధ్యాయులు మరియు సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం వివిధ క్రీడా పోటీలలో విజేతలుగా నిలిచిన విద్యార్థులందరికీ బహుమతులను ప్రిన్సిపాల్, ఖావీజ చైర్మన్, వైస్ చైర్మన్ చేతుల మీదుగా అందజేశారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని బాలల దినోత్సవ వేడుకలను ఆనందంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ విద్యార్థులకు బాలల దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేస్తూ, చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని సూచించారు.

తాడిపత్రిలో డ్రగ్స్, గంజాయి, మట్కా, పేకాట మహమ్మారిని అరికట్టాలి



అనంతపురం నవంబర్ 14 విభారె న్యూస్:- అనంతపురం జిల్లా తాడిపత్రి పట్టణంలో డ్రగ్స్, గంజాయి, మట్కా, పేకాట వంటి అసాంఘిక కార్యకలాపాలను అరికట్టేందుకు పోలీస్ శాఖ మరింత కఠిన చర్యలు తీసుకోవాలని వాల్మీకి సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షుడు బుల్లెట్ లింగమయ్య కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మత్తు పదార్థాలు, జూదం వంటి వ్యసనాలకు యువత, ప్రజలు బానిసలుగా మారితే వారి కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా యువత భవిష్యత్తు నాశనం కాకుండా పోలీస్ శాఖ ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి, డ్రగ్స్, గంజాయి, మట్కా, పేకాట కార్యకలాపాలపై కఠిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ఈ సమస్యను జిల్లా ఎస్పీ జగదీష్ గారి దృష్టికి తీసుకెళ్లి, తాడిపత్రిలో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేసేలా చర్యలు చేపట్టాలని కోరనున్నట్లు తెలిపారు. సమాజంలో పేకాట, మట్కా, మత్తు పదార్థాల ప్రభావం తగ్గితే ప్రజలు ప్రశాంతమైన వాతావరణంలో జీవించే అవకాశం ఉంటుందని అన్నారు. వాల్మీకి సేవాదళ్ ప్రతి ఆడబిడ్డకు, ప్రతి బాధిత కుటుంబానికి అండగా నిలుస్తుందని భరోసా ఇచ్చారు. ప్రజల భద్రత, యువత భవిష్యత్తు, మహిళల రక్షణే లక్ష్యంగా వాల్మీకి సేవాదళ్ నిరంతరం ప్రజల పక్షాన నిలుస్తుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో వాల్మీకి సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షుడు బుల్లెట్ లింగమయ్య, తాడిపత్రి టౌన్ ప్రెసిడెంట్ నాగేంద్ర, తాడిపత్రి సహాయ కార్యదర్శి సురేష్ వాల్మీకి తదితరులు పాల్గొన్నారు.

జై వాల్మీకి.. జై జై వాల్మీకి

కామన్వెల్త్ కరాటే ఛాంపియన్‌షిప్‌లో కర్నూలు విద్యార్థుల సత్తా.. అంతర్జాతీయ స్థాయిలో పతకాలతో మెరిసిన క్రీడాకారులు

● హేమంత్ కుమార్ రెడ్డికి గోల్డ్ మెడల్.. దినేష్‌కు బ్రాంజ్ మెడల్ ● విజేత క్రీడాకారులను ఘనంగా సత్కరించిన మంత్రి టీజీ భరత్



విభారె న్యూస్:- కర్నూల్ ప్రతినిధి నవంబర్ 14 స్కాట్లాండ్‌లో నిర్వహించిన 12వ కామన్వెల్త్ కరాటే ఛాంపియన్‌షిప్--2026లో కర్నూలుకు చెందిన విద్యార్థులు అంతర్జాతీయ స్థాయిలో అద్భుత ప్రతిభ కనబరిచి పతకాలు సాధించడం ఎంతో గర్వకారణమని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్ అన్నారు. కర్నూలు క్రీడాకారులు అంతర్జాతీయ వేదికపై సత్తా చాటడం జిల్లా ప్రజలకు ఎంతో ఆనందాన్ని, గౌరవాన్ని తీసుకొచ్చిందని పేర్కొన్నారు. కర్నూలు ఔట్‌డోర్ స్టేడియంలో నిర్వహించిన అభినందన కార్యక్రమంలో మంత్రి టీజీ భరత్ పాల్గొని పతక విజేతలను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కామన్వెల్త్ కరాటే ఛాంపియన్‌షిప్‌లో భారతదేశం మొత్తం 23 పతకాలు సాధించగా, ఆంధ్రప్రదేశ్‌కు మూడు పతకాలు లభించాయని తెలిపారు. ఇందులో కర్నూలుకు చెందిన హేమంత్ కుమార్ రెడ్డి గోల్డ్ మెడల్ సాధించడం ఎంతో గర్వంగా ఉందన్నారు. మరో క్రీడాకారుడు దినేష్ బ్రాంజ్ మెడల్ సాధించడం అభినందనీయమని పేర్కొన్నారు. క్రీడాకారుల విజయాలను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లేందుకు ప్రత్యేకంగా అపాయింట్‌మెంట్ తీసుకుని ఇటీవల వారిని కలిసే అవకాశం కల్పించానని మంత్రి తెలిపారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి క్రీడాకారులతో స్వయంగా మాట్లాడి వారి విజయాలను అభినందించారని చెప్పారు. గోల్డ్ మెడల్ సాధించిన క్రీడాకారుడికి రాష్ట్ర ప్రభుత్వం తరఫున అందాల్సిన ప్రైజ్ మనీ ఇప్పించేందుకు కృషి చేస్తున్నానని మంత్రి వెల్లడించారు. అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధించిన క్రీడాకారులకు అందించే సర్టిఫికెట్లు భవిష్యత్తులో ప్రభుత్వ ఉద్యోగాల అవకాశాలకు కూడా ఉపయోగపడతాయని తెలిపారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడలపైనా ప్రత్యేక శ్రద్ధ చూపాలని, నిరంతర సాధన, క్రమశిక్షణ, పట్టుదలతో ముందుకు సాగాలని సూచించారు. ఈ క్రీడాకారులను స్ఫూర్తిగా తీసుకుని మరింత మంది విద్యార్థులు క్రీడల్లో రాణించాలని పిలుపునిచ్చారు. కర్నూలులో క్రీడా రంగ అభివృద్ధికి తాము ఎంతో కృషి చేస్తున్నామని, క్రీడాకారులకు మెరుగైన వసతులు కల్పించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని మంత్రి తెలిపారు.

ఈ కార్యక్రమంలో కరాటే కోచ్ పి. జగదీష్ కుమార్ ని మంత్రి టి.జి. భరత్ ప్రత్యేకంగా అభినందించారు. విద్యార్థుల విజయాల వెనుక కోచ్ కృషి, అంకితభావాన్ని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో 61వ వార్డు కార్పొరేటర్ గాజుల విజయభాస్కర్ రెడ్డి, 62వ వార్డు కార్పొరేటర్ సురేంద్ర, సీనియర్ కరాటే మాస్టర్స్ హరీష్, గౌస్ బాషా, రమణ, ఫయాజ్, మునాఫ్, రాంబాబు, సురేంద్ర చిన్న తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సెయింట్ జోసెఫ్ హైస్కూల్‌లో బాలల దినోత్సవ వేడుకలు

విద్యార్థుల ప్రతిభకు పట్టం కట్టి.. బహుమతులతో ప్రోత్సహించిన పాఠశాల యాజమాన్యం



కోయిలకుంట్ల, నవంబర్,14 ట విభారె న్యూస్:- ఈ కోయిలకుంట్లలోని సెయింట్ జోసెఫ్ హైస్కూల్‌లో బాలల దినోత్సవ వేడుకలను ఆనందోత్సాహాల మధ్య ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో పండుగ వాతావరణం నెలకొంది. వివిధ రంగాల్లో తమ ప్రతిభను చాటుతూ విద్యా, క్రీడా, సాంస్కృతిక మరియు ఇతర పోటీలలో విజయాలు సాధించిన విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. ప్రిన్సిపాల్ సిస్టర్ గీతా గారు, కరస్పాండెంట్ సిస్టర్ జ్యోతి గారు విద్యార్థులకు బహుమతులు అందజేసి వారి విజయాలను ప్రశంసించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ సిస్టర్ గీతా గారు మాట్లాడుతూ.. విద్యార్థుల జీవితంలో బాల్యం ఎంతో విలువైనదని, ప్రతి ఒక్కరూ తమలోని ప్రతిభను గుర్తించి లక్ష్యసాధన దిశగా అడుగులు వేయాలని సూచించారు. కేవలం చదువులోనే కాకుండా క్రీడలు, కళలు, సృజనాత్మకత వంటి అన్ని రంగాల్లోనూ రాణించాలని అన్నారు.

"విజయం అనేది ఒక్కరోజులో సాధించేది కాదు.. నిరంతర కృషి, పట్టుదల, ఆత్మవిశ్వాసంతో సాధించేది. ఇతరులతో పోల్చుకోకుండా నిన్నటి కంటే ఈరోజు మరింత మెరుగ్గా ఉండేందుకు ప్రయత్నించండి. పెద్ద కలలు కనండి.. వాటిని నిజం చేసుకునేందుకు కష్టపడండి. మీలో ప్రతి ఒక్కరూ ప్రత్యేకమే.. మీ భవిష్యత్తు మీ చేతుల్లోనే ఉంది" అంటూ విద్యార్థుల్లో స్ఫూర్తి నింపారు.

అనంతరం బహుమతులు అందుకున్న విద్యార్థులు ఆనందం వ్యక్తం చేశారు. విద్యార్థుల ప్రతిభను గుర్తించి ప్రోత్సహించడం ద్వారా వారిలో మరింత ఆత్మవిశ్వాసం పెంపొందుతుందని పాఠశాల యాజమాన్యం పేర్కొంది.

ఈ కార్యక్రమంలో సిస్టర్ అనిత గారు, ఫిజికల్ డైరెక్టర్లు హర్ష, ఓబులేసు, ఉపాధ్యాయ బృందం మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థుల చిరునవ్వుల్లో ఆనందం.. వారి విజయాల్లో పాఠశాల గర్వం.. అనే సందేశంతో బాలల దినోత్సవ వేడుకలు విజయవంతంగా ముగిశాయి.

జ్యోతిర్మయి హైస్కూల్‌లో ఘనంగా బాలల దినోత్సవ వేడుకలు





విభారె న్యూస్:- నవంబరు 14, నంద్యాల జిల్లా. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని, క్రమశిక్షణతో ముందుకు సాగాలి -- వయోజన విద్య ఉపసంచాలకులు ఖ. చంద్రశేఖర్ రెడ్డి నంద్యాల పట్టణంలోని జ్యోతిర్మయి హైస్కూల్‌లో నవంబర్ 14వ తేదీన బాలల దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వయోజన విద్య ఉపసంచాలకులు శ్రీ ఖ. చంద్రశేఖర్ రెడ్డి గారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థులే దేశ భవిష్యత్తుకు పునాదులని, ప్రతి విద్యార్థి చిన్ననాటి నుంచే ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని, క్రమశిక్షణ, పట్టుదల, ఆత్మవిశ్వాసంతో విద్యను అభ్యసించాలని సూచించారు. విద్యతో పాటు నైతిక విలువలు, సమయపాలన, పెద్దల పట్ల గౌరవం, సమాజం పట్ల బాధ్యత వంటి మంచి లక్షణాలను అలవర్చుకోవాలని తెలిపారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు, ఇతర సృజనాత్మక రంగాల్లో కూడా ప్రతిభ కనబరచాలని సూచించారు. ఈ సందర్భంగా జ్యోతిర్మయి హైస్కూల్‌లో విద్యార్థులకు అందిస్తున్న నాణ్యమైన విద్య, క్రమశిక్షణ, మంచి విద్యా వాతావరణంపై ఆయన ప్రత్యేకంగా ప్రశంసలు వ్యక్తం చేశారు. ముఖ్యంగా పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీమతి ఇందు గారు విద్యార్థుల విద్యాభివృద్ధి కోసం చూపుతున్న అంకితభావం, కృషి, పట్టుదల ఎంతో అభినందనీయమని కొనియాడారు. విద్యార్థుల పట్ల వ్యక్తిగత శ్రద్ధ చూపుతూ, వారి ప్రతిభను గుర్తించి ప్రోత్సహించడం, వారిలో క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలను పెంపొందించడం వంటి అంశాల్లో ఆమె చేస్తున్న కృషి ప్రశంసనీయమని పేర్కొన్నారు. ప్రిన్సిపాల్ శ్రీమతి ఇందు గారి నిరంతర పర్యవేక్షణ, సమర్థవంతమైన నాయకత్వం, ఉపాధ్యాయులతో సమన్వయం కారణంగా విద్యార్థులు చదువుతో పాటు వివిధ రంగాల్లో కూడా మంచి ప్రతిభ కనబరుస్తున్నారని అభిప్రాయపడ్డారు. అదేవిధంగా పాఠశాల అభివృద్ధికి సహకరిస్తూ, విద్యార్థులకు మంచి విద్యా వాతావరణం కల్పించడంలో తోడ్పడుతున్న పాఠశాల కరస్పాండెంట్ శ్రీ సురేష్ గారిని కూడా అభినందించారు. అనంతరం వివిధ పోటీలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థినీ విద్యార్థులకు ముఖ్య అతిథి చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమం విద్యార్థుల్లో ఎంతో ఉత్సాహాన్ని, స్ఫూర్తిని నింపింది. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ శ్రీ సురేష్ గారు, ప్రిన్సిపాల్ శ్రీమతి ఇందు గారు, ఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

నంద్యాల వైస్ చైర్మన్ ఎంపికలో సామాజిక సమతుల్యతకు ప్రాధాన్యత ఇవ్వాలి!

ఎస్సీ, రెడ్డి సామాజిక వర్గాల నుంచి విద్యావంతులు, సమర్థులైన వారికి అవకాశం కల్పించాలి
మస్తాన్‌వలి, సీపీఎం మాజీ జిల్లా సీనియర్ నాయకులు,



విభారె న్యూస్:- నవంబరు 14,నంద్యాల జిల్లా. నంద్యాల మున్సిపల్ వైస్ చైర్మన్ పదవికి సంబంధించి సోషల్ మీడియాలో నలుగురి పేర్లు ప్రముఖంగా ప్రచారంలోకి వస్తున్నాయి. వారిలో దిలీప్ కుమార్, శ్యాంసుందర్, పబ్బతి వేణు, మహిళా కౌన్సిలర్ జై నబి పేర్లు వినిపిస్తున్నాయి. వీరి రాజకీయ నేపథ్యాన్ని పరిశీలిస్తే దిలీప్ కుమార్ గతంలో వైసీపీ నుంచి కౌన్సిలర్‌గా గెలుపొందగా, శ్యాంసుందర్ స్వతంత్ర అభ్యర్థిగా విజయం సాధించారు. మహిళా కౌన్సిలర్ జై నబి టీడీపీ నుంచి రెండుసార్లు వేర్వేరు వార్డుల్లో గెలుపొందారు. పబ్బతి వేణు తొలిసారిగా బీజేపీ నుంచి కూటమి అభ్యర్థిగా కౌన్సిలర్‌గా విజయం సాధించారు. ఈ పరిణామాలను గమనిస్తే టీడీపీలో సీనియర్ అనుభవం కలిగిన మహిళా కౌన్సిలర్ జై నబి ఉన్నారు. అయితే ఇప్పటికే మహిళకు చైర్మన్ పదవి కేటాయించిన నేపథ్యంలో మరోసారి అదే విధంగా కాకుండా, సామాజిక సమతుల్యతకు ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందని నా అభిప్రాయం. అదేవిధంగా పబ్బతి వేణు గారు బీజేపీ నుంచి తొలిసారిగా గెలుపొందినప్పటికీ, గతంలో ఆర్యవైశ్య సామాజిక వర్గానికి చెందిన వారు పలుమార్లు వైస్ చైర్మన్ పదవిని చేపట్టిన విషయాన్ని కూడా పరిగణనలోకి తీసుకోవాలి. కావున నంద్యాల పట్టణ సమగ్ర అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని ఎస్సీ, రెడ్డి సామాజిక వర్గాల నుంచి విద్యావంతులు, రాజకీయ అవగాహన కలిగిన, పట్టణ సమస్యలపై స్పష్టమైన దృష్టి ఉన్న సమర్థవంతమైన వ్యక్తులను వైస్ చైర్మన్ పదవికి ఎంపిక చేస్తే రెండు కూటములకు సముచితంగా ఉంటుందని భావిస్తున్నాను. వైస్ చైర్మన్ పదవి కేవలం రాజకీయ పదవిగా కాకుండా పట్టణ అభివృద్ధికి బాధ్యత వహించే కీలకమైన స్థానంగా ఉండాలి. ప్రజా సమస్యల పరిష్కారం, అభివృద్ధి కార్యక్రమాల అమలు, అన్ని వర్గాల ప్రజలకు సమాన ప్రాధాన్యత కల్పించే ఆలోచన ఉన్న నాయకులకు అవకాశం ఇవ్వడం సమంజసం. అయితే అంతిమ నిర్ణయం టీడీపీ, వైసీపీ కూటముల అగ్రనాయకత్వానిదే. వారి నిర్ణయాలు, ఆదేశాలకు అనుగుణంగానే తుది ఎంపిక జరుగుతుంది. నంద్యాల పట్టణ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని నా వ్యక్తిగత అభిప్రాయాన్ని ప్రజల ముందుంచుతున్నాను.

-- మస్తాన్‌వలి సీపీఎం మాజీ జిల్లా సీనియర్ నాయకులు, నంద్యాల

కేసీ కెనాల్‌కు తక్షణమే సాగునీరు విడుదల చేసి రైతులను ఆదుకోండి...

మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ పురుషోత్తం రెడ్డి





విభారె న్యూస్:- నవంబరు 14, నంద్యాల జిల్లా. వర్షాభావం వల్ల ఎండిపోతున్న పంటలు.. ఆందోళనలో అన్నదాతలు ప్రకృతి కరుణించక, సరిపడా వర్షాలు కురవక అల్లాడిపోతున్న అన్నదాతలను ఆదుకునేందుకు ప్రభుత్వం తక్షణమే కేసీ కెనాల్‌కు సాగునీరు విడుదల చేయాలని, మంత్రి తక్షణమే స్పందించాలని రైతులు కోరుతున్నారు. నేడు మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ పురుషోత్తం రెడ్డితో పాటు పలువురు రైతులు కేసీ కెనాల్ ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్ (జుజు) కార్యాలయానికి వెళ్లి అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతులు తాము పడుతున్న ఇబ్బందులను, కష్టాలను అధికారుల ఎదుట ఏకరువు పెట్టారు. సాగునీరు సకాలంలో అందక తాము సాగు చేసిన పంటలు కళ్లెదుటే ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ పురుషోత్తం రెడ్డి మాట్లాడుతూ...ప్రస్తుతం వెలుగోడు రిజర్వాయర్‌లో 9.5 టీఎంసీల నీటి నిల్వలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. అందులో కేవలం ఒక్క టీఎంసీ నీటిని మాత్రమే కేసీ కెనాల్‌కు విడుదల చేస్తే, ఆయకట్టు కింద ఉన్న వేలాది ఎకరాల పంటలకు జీవం పోసినట్లవుతుందని కోరారు. ముఖ్యంగా జొన్న పంట సాగు చేసిన రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మరో రెండు రోజుల్లోగా నీరు అందకపోతే పంట పూర్తిగా ఎండిపోయి, రైతులు కోలుకోలేని ఆర్థిక నష్టాన్ని చవిచూడాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. స్థానిక మంత్రివర్యులు మరియు ప్రజాప్రతినిధులు స్పందించి, రైతుల కష్టాలను మానవతా దృక్పథంతో పరిశీలించాలని కోరారు. తక్షణమే సంబంధిత అధికారులకు తగిన ఆదేశాలు జారీ చేసి, కేసీ కెనాల్ ద్వారా సాగునీరు అందించి తమను ఆదుకోవాలని రైతులు కన్నీటి పర్యంతమయ్యారు. అన్నాదాతలను ఆదుకునేందుకు ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన స్పందించాలని విజ్ఞప్తి చేశారు.

జాతీయ స్థాయిలో 7వ నేషనల్

వాటర్ అవార్డు సాధనే లక్ష్యంగా సమన్వయంతో పనిచేయాలి

- నీటి సంరక్షణ, జల వనరుల అభివృద్ధి కార్యక్రమాలను సమర్థవంతంగా ప్రదర్శించాలి
- క్షేత్రస్థాయి పరిశీలనకు వచ్చే కేంద్ర బృందానికి జిల్లాలో చేపట్టిన ఉత్తమ పనులను వివరించాలి
- జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా





విభారె న్యూస్:-నంద్యాల జిల్లా, నవంబరు 14 :- జిల్లాలో నీటి సంరక్షణ, జల వనరుల అభివృద్ధి, భూగర్భ జలాల పరిరక్షణకు వివిధ శాఖల ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమాలను సమర్థవంతంగా వివరించి, 7వ జాతీయ జల అవార్డులు (7ష్ట చీఘ్అశీఱుశ్రీ ఔఘ్వతీ ూఘుతీఎం) సాధించే దిశగా సమన్వయంతో కృషి చేయాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో 7వ జాతీయ జల అవార్డుల సాధనకు సంబంధించి కేంద్ర ప్రభుత్వానికి సమర్పించాల్సిన ప్రతిపాదనలు, జిల్లాలో నీటి సంరక్షణ కోసం చేపట్టిన కార్యక్రమాలు, సాధించిన ప్రగతిపై వివిధ శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, సెంట్రల్ వాటర్ కమిషన్ నుంచి వచ్చే బృందం జిల్లాలో చేపట్టిన నీటి సంరక్షణ, జల వనరుల అభివృద్ధి కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, ధ్రువీకరించనున్నట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో సంబంధిత శాఖల అధికారులు పూర్తి సమాచారంతో, సమగ్ర నివేదికలు, ఆధారాలతో సిద్ధంగా ఉండాలని సూచించారు. ఈ నెల 17, 18 తేదీల్లో కేంద్ర బృందం జిల్లాలో పర్యటించనున్న నేపథ్యంలో బనగానపల్లి, ఔకు, కొలిమిగుండ్ల తదితర ప్రాంతాల్లో పర్యటనకు అవసరమైన ఏర్పాట్లు చేయాలన్నారు. జల వనరుల శాఖ, డ్వామా ఆధ్వర్యంలో చేపట్టిన నీటి సంరక్షణ పనులు, పండ్ల తోటలు, మొక్కల పెంపకం, పాఠశాలలు, గ్రామ పంచాయతీలు, ఆసుపత్రుల్లో పచ్చదనం పెంపునకు చేపట్టిన కార్యక్రమాలను బృందానికి వివరించాలని కలెక్టర్ ఆదేశించారు.

అదేవిధంగా రెండవ రోజు నంద్యాల పట్టణంలోని మురుగునీటి శుద్ధి కేంద్రం (ట్రీట్‌మెంట్ ప్లాంట్), పాణ్యం, బేతంచెర్ల, డోన్ మండలాల్లో చేపట్టిన వివిధ అభివృద్ధి, నీటి సంరక్షణ కార్యక్రమాలను కేంద్ర బృందం పరిశీలించనున్నట్లు తెలిపారు. మైక్రో ఇరిగేషన్, జల వనరులు, డ్వామా, పబ్లిక్ హెల్త్, గ్రౌండ్ వాటర్ తదితర శాఖలు తమ పరిధిలో అమలు చేసిన ఉత్తమ కార్యక్రమాలను గుర్తించి, వాటి ఫలితాలు, ప్రభావాన్ని స్పష్టమైన గణాంకాలు, ఫొటోలు, సంబంధిత రికార్డులతో సహా ప్రదర్శించాలని కలెక్టర్ ఆదేశించారు. కేంద్ర బృందం క్షేత్రస్థాయి పరిశీలనకు వచ్చినప్పుడు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో వ్యవహరించాలని, జిల్లాలో సాధించిన ప్రగతిని సమర్థవంతంగా వివరించేలా నాణ్యమైన ప్రజెంటేషన్ సిద్ధం చేయాలని సూచించారు. జాతీయ స్థాయిలో నంద్యాల జిల్లాకు గుర్తింపు తీసుకువచ్చేలా ప్రతి శాఖ బాధ్యతాయుతంగా పనిచేసి, 7వ జాతీయ జల అవార్డు సాధనకు కృషి చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు.

రాయల్ అండ్ నారాయణ పాఠశాలలో ఘనంగా బాలల దినోత్సవ వేడుకలు





విభారె న్యూస్:-నవంబరు 14, నంద్యాల జిల్లా. నంద్యాల: రాయల్ అండ్ నారాయణ పాఠశాలలో బాలల దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ వి. యాకుబ్, కరస్పాండెంట్ వి. ఇషాక్‌వలి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ వి. యాకుబ్ మాట్లాడుతూ.. భారత తొలి ప్రధానమంత్రి పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ జీవిత విశేషాలను విద్యార్థులకు వివరించారు. నెహ్రూ గారికి పిల్లలంటే ఎంతో ఇష్టమని, అందుకే ఆయన జన్మదినమైన నవంబర్ 14వ తేదీని బాలల దినోత్సవంగా జరుపుకుంటామని తెలిపారు. సంపన్న కుటుంబంలో జన్మించినప్పటికీ దేశ స్వాతంత్ర్యం కోసం మహాత్మా గాంధీతో కలిసి స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొని పలుమార్లు జైలు జీవితం గడిపారని వివరించారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన అనంతరం భారతదేశ తొలి ప్రధానమంత్రిగా బాధ్యతలు చేపట్టారని విద్యార్థులకు తెలియజేశారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. వివిధ ఆటల పోటీల్లో విజయం సాధించిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

టీడీపీలోకి భారీగా చేరికలు..

బిల్లాలాపురంలో 35 వైసీపీ కుటుంబాలు సైకిల్ ఎక్కాయి





విభారె న్యూస్:-నంద్యాల జిల్లా, నవంబర్ 14: గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో నంద్యాల నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ మరింత బలపడుతోంది. శనివారం నంద్యాల మండలం బిల్లాలాపురం గ్రామానికి చెందిన జాగటి నాగమయ్య, జాగటి వెంకటేశ్వర్లు, బోప్ప మౌలాలి, మాగం వెంకటేశ్వర్లు, మాగం చంటి, జిలకర యేసు, కోయల అనిల్ తో పాటు 35 వైసీపీ కుటుంబాలు ఆ పార్టీని వీడి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయశాఖ మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రివర్యులు ఎన్ఎండి ఫరూక్ మరియు నంద్యాల టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీలో చేరాయి. పార్టీలో చేరిన వారికి మంత్రి ఎన్ఎండి ఫరూక్, ఎన్ఎండి ఫిరోజ్ పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎన్ఎండి ఫరూక్, ఎన్ఎండి ఫిరోజ్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై ప్రజలు స్వచ్ఛందంగా టీడీపీలోకి వస్తున్నారని తెలిపారు. సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికల వేళ ఈ చేరికలతో బిల్లాలాపురంలో తెలుగుదేశం పార్టీకి మరింత బలం చేకూరిందని, రాబోయే ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల విజయం నల్లేరుపై నడకేనని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నంద్యాల మండల టిడిపి నాయకులు, బిల్లాలాపురం గ్రామ ముఖ్య నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అన్ని సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాలను కూటమి అభ్యర్థులు కైవసం చేసుకోవాలి: మంత్రి ఎన్ఎండి ఫరూక్ పిలుపు



విభారె న్యూస్:- నంద్యాల జిల్లా , నవంబర్ 14:. రాష్ట్రంలో గ్రామ పంచాయతీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ రేపటి (నవంబర్ 15) నుండి ప్రారంభం కానున్న నేపథ్యంలో, శనివారం నంద్యాలలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయశాఖ మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రివర్యులు ఎన్ఎండి ఫరూక్ ముఖ్య నాయకులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. నంద్యాల, గోస్పాడు మండలాలకు చెందిన టిడిపి ముఖ్య నాయకులతో మంత్రి ఫరూక్ సుదీర్ఘంగా చర్చించి ఎన్నికల వ్యూహాలపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా మంత్రి ఫరూక్ మాట్లాడుతూ గ్రామ స్థాయిలో టిడిపి పార్టీని మరింత బలోపేతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని కోరారు. నామినేషన్ల దాఖలు నుండి పోలింగ్ వరకు పూర్తి సమన్వయంతో పనిచేసి, నంద్యాల మరియు గోస్పాడు మండలాల్లోని సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాలన్నింటినీ కూటమి అభ్యర్థులు కైవసం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో నంద్యాల మార్కెట్ యార్డ్ చైర్మన్ గుంటుపల్లి హరిబాబు , పాణ్యం వెంకటేశ్వర్లు మరియు నంద్యాల , గోస్పాడు మండలాల ప్రజాప్రతినిధులు, పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పంచాయతీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియలో ఎన్నికల నియమావళిని తప్పనిసరిగా పాటించాలి



విభారె న్యూస్:- నంద్యాల జిల్లా , 14.11.2026. నామినేషన్ కేంద్రాల వద్ద అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా పటిష్ట పోలీసు బందోబస్తు జిల్లా వ్యాప్తంగా పోలీస్ యాక్ట్ 30, సెక్షన్ 163 దీచీూూ నిషేధాజ్ఞలు అమలు.

నామినేషన్ కేంద్రాల వద్ద సీసీ కెమెరాలు, డ్రోన్ కెమెరాలతో నిరంతర నిఘా, ప్రత్యేక పోలీసు బందోబస్తు ఏర్పాటు

జిల్లా ఎస్పీ శ్రీ సునీల్ షోరాణ్ ఖూ గారు

నంద్యాల జిల్లా వ్యాప్తంగా పంచాయతీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ సందర్భంగా ఎన్నికల నియమావళిని ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని జిల్లా ఎస్పీ శ్రీ సునీల్ షోరాణ్ ఖూ గారు ఆదేశించారు.

నామినేషన్ దాఖలు చేసే అభ్యర్థితో పాటు కేవలం ఇద్దరు ప్రతినిధులకు మాత్రమే నామినేషన్ కేంద్రంలోకి అనుమతి ఉంటుందని తెలిపారు. నామినేషన్ కేంద్రాల వద్ద ర్యాలీలు, ఊరేగింపులు నిర్వహించడం, గుంపులుగా చేరడం, నినాదాలు చేయడం, ప్రచార కార్యక్రమాలు నిర్వహించడం నిషేధమని స్పష్టం చేశారు. నామినేషన్ కేంద్రాల పరిసరాల్లో 100 నుంచి 200 మీటర్ల పరిధిలో ఎలాంటి జనసమూహాలు గుమిగూడకుండా పోలీసు అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా పోలీస్ యాక్ట్ 30 మరియు సెక్షన్ 163 దీచీూూ నిషేధాజ్ఞలు అమల్లో ఉన్నాయని, నామినేషన్ కేంద్రాల వద్ద సీసీ కెమెరాలు, డ్రోన్ కెమెరాలతో నిరంతర నిఘా ఏర్పాటు చేయడంతో పాటు పటిష్టమైన పోలీసు బందోబస్తు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల నియమావళిని ఉల్లంఘించినా, శాంతిభద్రతలకు భంగం కలిగించినా సంబంధిత వ్యక్తులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ప్రశాంతమైన, పారదర్శకమైన ఎన్నికల నిర్వహణకు అభ్యర్థులు, ప్రజలు, రాజకీయ పార్టీల ప్రతినిధులు పోలీసు శాఖకు సహకరించాలని జిల్లా ఎస్పీ గారు విజ్ఞప్తి చేశారు.

EDITED, PRINTED PUBLISHED AND OWNED BY AVULA VIJAYA BHASKARA REDDY PRINTED AT SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPPTAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL-518001. ANDHRA PRADESH. PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR: AVULA VIJAYA BHASKARA REDDY. RNI No: APTEL/2019/77190